క్లుప్తంగా

నూకాలమ్మ ఆలయ హుండీ అపహరణ

తెనాలిరూరల్: స్థానిక ఇస్లాంపేట పరిధిలోని కబేళా వంతెన సమీపంలోని శ్రీ నూకాలమ్మ తల్లి ఆలయంలోని హుండీ చోరీకి గురైంది. బుధవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో దేవస్థానాన్ని శుభ్రం చేసేందుకని వచ్చిన స్థానిక మహిళ సింగంపల్లి మల్లేశ్వరి అమ్మవారి ముందు ఉండాల్సిన హుండీ చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ దేవాలయం ఇక్కడ ఉండగా శిథిలావస్థకు చేరడంతో సుమారు ఆరు నెలల క్రితం కొత్తగా నిర్మాణం ప్రారంభించారు. రాత్రి 11 గంటల వరకూ తాము అక్కడే ఉన్నామని ఆ తర్వాత ఎవరో వచ్చి హుండీ అపహరించుకు వెళ్లి ఉంటారని స్థానికులు తెలిపారు. హుండీలో సుమారు రూ.70 వేల వరకు నగదు ఉంటుందని భావిస్తున్నారు.

అమర కళాకారుల సంస్మరణ



తెనాలి: పట్టణ గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో బుధవారం అమర కళాకారుల సంస్మరణ సభ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అభ్యుదయ కళాసమితి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి తన్నీరు శివశంకర్ అధ్యక్షత వహించారు. సినీనటుడు, ప్రజానాట్యమంలి జాతీయ నాయకుడు 'రక్తకన్నీరు' నాగభూషణం, లక్ష్మీ పెరుమాళ్ల, కోడూరు అచ్చయ్య, రూపశిల్పి కుమార్‌లను స్మరించుకున్నారు. కళాకారులు చందు సూర్య, చింతా భాస్కరరావు, ఈపూరు ప్రేమ్‌కుమార్, దాస్యం బాబూరావు, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

హైస్కూలులో 'స్వచ్ఛతా పక్వాడా'



తెనాలి: పట్టణ అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో బుధవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమన్ని నిర్వహించారు. పరిశుభ్రత ఎలా పాటించాలి... ఎలా కలిగిఉండాలి...ఎలా ప్రోత్సహించాలి...అనే అంశాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. గోళ్లను కత్తిరించుకోవటం, శుభ్రమైన నీటితో స్నానం చేయటం, ఉతికిన దుస్తులు ధరించటం, రోజుకు రెండుసార్లు పళ్లతోముకోవటం మంచి అలవాట్లను పాటించాలని సూచించారు. విద్యార్థులతో చేతుల పరిశుభ్రంగా కడుక్కోవటాన్ని నేర్పారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ప్రసూనాదేవి మాట్లాడుతూ, ఆరోగ్యంగా జీవించటానికి శుభ్రత, పరిశుభ్రత ఆవశ్యకతను వివరంచారు. ఆ ప్రకారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బెల్లంకొండ వెంకట్ కార్యక్రమన్ని నిర్వహించగా, స్వర్ణమంజరి, రాబియా బాసం తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13న ఓజోన్ దినోత్సవంపై అంతర్ కళాశాలల పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈనెల 13న ఏఎన్‌యూ అంతర్ కళాశాలల స్థాయిలో వకృత్వ పోటీలను పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ''ఓజోన్ క్షీణతకు గురి చేసే పదార్థాలను తగ్గించే నూతన పరిష్కార మార్గాలు'' అనే అంశంపై ఐదు నిముషాలకు తగ్గకుండా మాట్లాడాలని సూచించారు. పోటీలకు ప్రతి కళాశాల నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థుల పాల్గొనవచ్చునని, విజేతలకు తొలి మూడుస్థానాల్లో బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. అదే విధంగా పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ప్రశంసాపత్రం అందిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జీవీ సుధీర్‌కుమార్ (98498 54221) ను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కామెల్ జాతీయ ప్రదర్శనకు ఏఎన్‌యూ విద్యార్థి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థి సోనుదాస్ క్యామెల్ కంపెనీ నిర్వహిస్తున్న జాతీయ క్యాంప్, చిత్ర ప్రదర్శనకు ఎంపికయ్యాడు. కర్ణాటక రాష్ట్రం హంపిలో నవంబర్ 25 నుంచి 29 వరకు ఈ క్యాంప్ కొనసాగుతుంది. ఈ క్యాంప్‌లో ఎంపిక చేయబడ్డ వర్ణ చిత్రాలు వచ్చేయడాది జనవరిలో ముంబాయి జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.గంగాధర రావు విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి. శేఖర్ బాబు, అధ్యాపకులు పి. దేవకాంత్ పాల్గొన్నారు.

ఎకరానికి రూ.20 వేలు నష్టపరిహారమివ్వాలి

పెదకాకాని: వరదలతో పంట నష్టపోయిన ప్రతి రైతులకు ఎకరానికి 20 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కాలువ కట్టలకు గండ్లు పడి గత పది రోజులుగా వరి పైర్లు నీటిలోనే మునిగి దెబ్బతిన్న ప్రాంతాల్లో బుధవారం సీపీఎం నాయకులు సందర్శించారు. పెదకాకాని, దుగ్గిరాల, తెనాలి రూరల్ మండల ప్రాంతాల్లో తిరిగి వరి పొలాలను బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, నంబూరు, దేవరామబొట్లవారిపాలెం, తంగెళ్ళమూడి గ్రామల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, రాజారమేష్, వసంతరావు, రాంబాబు, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పంటలకు భారీ నష్టం

- మొత్తం 11,742 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- 8,937 ఎకరాల్లో వరి మునక
- 2,804 ఎకరాల్లోని ఉద్యాన పంటలకు నష్టం
- ఇంకా 5,467 ఎకరాల్లో జరగాల్సిన ఎన్యూమరేషన్



ఖాజీపేట-హాఫ్‌పేట మధ్య వరదనీటిలో వరిపైరు

తెనాలి: భారీ వర్షాలు, వరదలు నియోజకవర్గంలో రైతులు భారీగా నష్టపోయారు. ఖరీఫ్ సీజను ఆరంభంలోనే కోలుకోలేనంగా దెబ్బతిన్నారు. పంటసాగుకు పెట్టిన పెట్టుబడులతో సహా పంటను కోల్పోయారు. వర్షాలు నిలిచిపోయినా చాలా చోట్ల పంట పొలాల్లో నిలిచిన నీరు ఇప్పటికీ పూర్తిగా బయటకు పోనేలేదు. ముఖ్యంగా నీరు నిలిచిన మాగాణిల్లో వరిపైరు మళ్లీ తలెత్తే పరిస్థితి కనిపించటం లేదు. దీంతో మళ్లీ పంటసాగుకు అవకాశం ఉంటుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విస్తారంగా వర్షాలు..

గత నెల 30వ తేదీ నుంచి వారం రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. తొలి రెండురోజులు భారీ వర్షాలు కురిశాయి. ఆ రెండురోజుల్లోనే తెనాలి ప్రాంతంలో 16 సెంటీ మీటర్ల వర్షం నమోదైంది. దీంతో పంటపొలాలు నీటమునిగాయి. ఖరీఫ్‌లో మాగాణిలో సాగుచేసే వరిపైరు, మెట్ట భూముల్లో పండించే అరటి, పసుపు వంటి వాణిజ్యపంటలు, కూరగాయలు చేలు నీటమునిగాయి. రోజుల తరబడి నీరు నిలవటంతో ఆయా పంటలు చేతికొచ్చే అవకాశం లేదంటున్నారు.

నష్ట అంచనాలు..

వర్షాలు ఆగిపోయి, వరదనీరు తగ్గిపోతుండటంతో వ్యవసాయ, ఉద్యాన శాఖలు పంట నష్టం ఎన్యూమరేషను చేపట్టాయి. తెనాలి నియోజకవర్గంలో 8,937.5 ఎకరాల్లో వరి పైరు దెబ్బతింది. మొత్తం 2,319 రైతులకు నష్టం వాటిల్లినట్టయింది. తెనాలి మండలంలో 6,720 ఎకరాల్లోని వరి చేలు ముంపునకు గురయ్యాయి. 1123 మంది రైతులు బాధితులయ్యారు. కొల్లిపర మండలంలో 1196 మంది రైతులకు చెందిన 2,217.5 ఎకరాల్లో వరిపైరు నీటమునిగింది. ప్రస్తుతం 3,394.5 ఎకరాల్లో ఎన్యూమరేషన్ పూర్తికాగా, 5,467 ఎకరాల్లో చేయాల్సి ఉందని వ్యవసాయశాఖ ఏడీఏ ఉషారాణి వెల్లడించారు.



తూములూరు సమీపంలో వరదనీటిలో పసుపుపంట

వాణిజ్య పంటలు..

ఉద్యాన పంటల విషయానికొస్తే, నియోజకవర్గంలో 1,888 మంది రైతులకు చెందిన 2,804.71 ఎకరాల్లో పంటలకు నష్టం కలిగింది. తెనాలి మండలంలో 1144.7 ఎకరాల్లోని అరటి, పసుపు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం రైతులు 217 మంది. కొల్లిపర మండలంలో 1,660 ఎకరాల్లోని ఉద్యానపంటలకు నష్టం సంభవించింది. రైతులు 1,671 మంది నష్టపోయారు. ఈ మండలంలో 766 ఎకరాల్లో పసుపు, 733 ఎకరాల్లో అరటి, 161 ఎకరాల్లోని కూరగాయల పంటలకు నష్టం కలిగింది.

ఇంకా వరద ముంపులో..

వరద నీట మునిగిన పంటపొలాల్లో చాలాచోట్ల వరదనీరు ఇంకా పూర్తిగా బయటకు పోనేలేదు. ముఖ్యంగా పల్లపు చేలల్లో మరికొన్ని రోజుల వ్యవధి పట్టేలా ఉంది. పదిరోజులకు పైగా నీటిలో ఉంటే వరిపైరుకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిసిందే. ఇప్పటికే సెప్టెంబరు రెండో వారంలోకి ప్రవేశించినందున, నీరంతా పూర్తిగా బయటకు వెళ్లి, మరోసారి వరి విత్తనాలు వెద జల్లేందుకు అవకాశం ఉంటుందో లేదోనన్నది ప్రశ్నార్థకమే. రైతుల్లో అత్యధికులు కౌలురైతులే. ఎకరా రూ.22–25 వేల చొప్పున కౌలుకు తీసుకుని, రూ.8–10 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఉద్యాన పంటల రైతులదీ ఇదే పరిస్థితి. పసుపు, అరటి పంటల సాగుకు కౌలుతో సహా పెట్టుబడులు అధికమని తెలిసిందే. వరద నీటిలో ఉన్న పసుపుకు దుంపకుళ్లు సోకుతుంది. పంట దిగుబడిపై ఆశలు వదులుకోవాల్సిందే. రైతుల ఆశలన్నీ ఎన్యూమరేషన్ పూర్తయ్యాక ప్రభుత్వం ప్రకటించే నష్టపరిహారం పైనే ఉన్నాయి.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం

- ప్రచార ఆర్భాటం మినహా సాయం చేసింది లేదు
- ఫలితంగానే రోజుల తరబడి వరదనీటిలో బాధితులు
- ఇప్పటికైనా నష్టపరిహారాన్ని త్వరగా అందించండి
- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



తెనాలి: వరద నుంచి విజయవాడ ప్రజలను కాపాడడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. కృష్ణానది వరదలు, బాధితులకు సాయం దుర్లభం కావటంపై బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలపై వాతావరణశాఖ, నీటిపారుదలశాఖ వారంరోజులు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం ముందుజాగ్రత్తలు తీసుకోలేదన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా నిర్లక్ష్యం వహించి, ప్రాణ, ఆస్తినష్టానికి కారణమైనట్లు గుర్తుచేశారు. వరద బాధితులకు సాయంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెప్పారు. కనీసం ఆహారం కూడా సక్రమంగా పంపిణీ చేయకపోవటంతో బాధితులు ఆకలిదప్పులతో గడపాల్సి వచ్చిందని వివరించారు. బుడమేరుకు వరదనీరు పోటెత్తుతుందని తెలిసినా, ఫ్లడ్ కుషన్ విధానాన్ని పాటించలేదని విమర్శించారు. తీరా వరద ముంచుకొచ్చాక, ప్రజలకు సమాచారం ఇవ్వకుండా వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా గేట్లు ఎత్తి, విజయవాడ పట్టణం మీదికి వదిలారని ఆరోపించారు. కరకట్టపై ఉన్న చంద్రబాబు నివాసం, ఏబీఎస్ రాధాకృష్ణ పవర్‌ప్లాంట్ మునిగిపోకుండా ఉండేందుకు ఈ చర్యకు పాల్పడ్డారని శివకుమార్ చెప్పారు. వరదనీరు తన నివాసాన్ని ముంచెత్తటంతో చంద్రబబు కలెక్టర్ కార్యాలయంలో సమీక్షల పేరుతో కాలక్షేపం చేశారనీ, ప్రజలకు మాత్రం రక్షణ కల్పించలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత వల్లే 50 మదికి పైగా వరదల్లో మృత్యువాత పడ్డారని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు ఎవరికివారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లి, ప్రాణాలను కాపాడుకున్నారనీ, ప్రభుత్వం ఏమాత్రం సహకరించలేదని వివరించారు.

నష్టపరిహారం అందించాలి

వరద నీటిలో గడుపుతున్న బాధితులకు తాగునీరు, ఆహారం, పిల్లలకు పాలను ఇవ్వటలోనూ రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావటం దారుణమని శివకుమార్ అన్నారు. వరద తగ్గుముఖం పట్టాక కూడా సహాయక చర్యల అమలులో సమన్వయలోపం స్పష్టంగా ఉందన్నారు. ఫలితంగా లక్షలమంది ప్రజలు రోజుల తరబడి వరదనీటిలో నరకం అనుభవించారని చెప్పారు. కేవలం అధికారులతో సమీక్షలు, మొక్కుబడి పర్యటనలతోనే చంద్రబాబు కాలక్షేపం చేశారనీ, అందించిన సాయంకన్నా ఆర్భాటపు ప్రచారం ఎక్కువైందన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, కృష్ణానది వెంబడి రిటర్నింగ్ వాల్ నిర్మించటంతో కృష్ణలంక, పరిసరాల్లోని ప్రజలు వరదలకు క్షేమంగా ఉండగలిగారనీ, లేకుంటే ఎంతో ప్రాణ, ఆస్తినష్టం జరిగివుండేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం వరదలతో నష్టపోయిన కుటుంబాలను, రైతులను తప్పనిసరిగా ఆదుకోవాలని, నష్టపరిహారాన్ని వేగిరం అందించాలని డిమాండ్‌చేశారు.

టూ టౌన్ సీఐగా నిస్సార్ బాషా

తెనాలిరూరల్: తెనాలి టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్‌కే ఎండీ నిస్సార్ బాషా నియమితులయ్యారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఆయన్ను ఇక్కడ సీఐగా నియమిస్తూ కోస్టల్ రేంజ్ ఐజీ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న ఎ.సుధాకర్ ఇటీవల సస్పెన్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. కాగా నిస్సార్ బాషా గతంలో తెనాలి వన్‌టౌన్ ఎస్ఐగా పని చేశారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

ఐసీడీఎస్ జిల్లా డైరెక్టర్ ఉమాదేవి



అవగాహన కార్యక్రమంలో ఉమాదేవి, డాక్టర్ శారద

తెనాలి: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే రక్తహీనత నుంచి దూరంగా ఉండొచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ గుంటూరు జిల్లా డైరెక్టర్ ఎం.ఉమాదేవి సూచించారు. పోషణ మాసోత్సవం సందర్భంగా రూరల్ మండలంలోని కొలకలూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రక్తహీనత కలిగిన తల్లులు, గర్భిణులకు పలు సూచనలు చేశారు. ఆకు కూరలు తీసుకోవాలని ముఖ్యంగా ప్రతిరోజూ మునగాకును ఆహారంతో కలిపి తీసుకోవాలని సలహానిచ్చారు. కుటుంబ సభ్యులంతా కలిసి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, ఉన్నతమైన ఆలోచనలు కలిగి జీవించాలనీ చెప్పారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సునీత, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు, డీ3 శారద సర్వీస్ సొసైటి, తెనాలి వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద, నోడల్ అధికారి టి.శ్రీవాణి, సూపర్‌వైజర్ హిమబిందు, కొలకలూరు సెక్టారు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ తర్వాత సమీపంలోని ఖాజీపేటలో తల్లులు, గర్భిణులు రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ కొలకలూరు సూపర్‌వైజర్ హిమబిందు సూచనలు చేశారు. అనంతరం కొలకలూరు-2 సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలోనూ తల్లులతో సమావేశం నిర్వహించారు.

భూ రికార్డులు సరిచేయాలని రైతుల వినతి



తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తెనాలిరూరల్: తమ భూములు రెవెన్యూ రికార్డుల్లో దేవదాయ శాఖ భూములుగా కనబడుతున్నాయని, వెంటనే సరిచేయాలని తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన సుమారు 60 మంది రైతులు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను బుధవారం రాత్రి కలసి విజ్ఞప్తి చేశారు. 1930 నుంచి గ్రామ పరిధిలోని భూములు తమ పేరిట ఉన్నాయని, అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల పత్రాలు, పాస్‌పుస్తకాలు తమ వద్ద ఉన్నాయని తహసీల్దార్‌కు విన్నవించారు. తమ భూములను 2019లో దేవాయ శాఖ అధికారులు ఆ శాఖకు చెందిన భూములంటూ గ్రామస్తుల దృష్టికి తీసుకొచ్చారని, ఎవరికి ఎటువంటి నోటీసులివ్వకుండా రెవెన్యూ శాఖతో కలసి భూములను దేవదాయ శాఖకు చెందినివిగా రికార్డుల్లో మార్పులు చేశారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుని రికార్డుల్లో మార్పులు చేయాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. దీనికి తహసీల్దార్ సమాధానమిస్తూ రైతుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తనని, ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రాహుల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం



మాట్లాడుతున్న అనంతాచార్యులు

తెనాలిరూరల్: అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు అన్నారు. స్థానిక మారీసుపేటలో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అగ్ర నాయకుడిగా లోక్‌సభలో ప్రతిపక్ష హోదాలో ఉన్న రాహుల్ గాంధీ అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ఆర్ఎస్ఎస్, బీజేపీలు మహిళలపై చిన్న చూపు కలిగి ఉన్నాయని మాట్లాడటం బాధాకరమని అన్నారు. విదేశాలకు వెళ్లినప్పుడు మాతృదేశం గురించి మంచి మాటలు మాట్లాడాలి కానీ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టమన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు, తెనాలి మండల అధ్యక్షుడు కడియాల నంద కిషోర్, గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు కఠారి వాసుదేవ నాయుడు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ని నివారించాలి

సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి



ప్రత్తిపాడు: విద్యార్థుల డ్రాపౌట్స్ లేకుండా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపిసి బుధవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. రెండు రోజుల కన్నా అదనంగా విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరైతే తల్లిదండ్రులకు ఫోన్ చేసి తమ పిల్లలు ఎందుకు పాఠశాలకు హాజరు కావడం లేదో తెలుసుకోవాలన్నారు. బడి మధ్యలో పిల్లలు మానివేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అలానే మరింత నాణ్యతతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఎండీఎం నాణ్యతను పరిశీలించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని ఏపీసీ తనిఖీ చేశారు. రిజిస్టర్లును పరిశీలించి, హౌసింగ్ లే అవుట్‌ను సందర్శించారు. వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

వరిలో సస్యరక్షణ అవసరం

- అధిక వర్షాలతో తెగుళ్ల ముప్పు
- అధికారుల సూచనలు ప్రకారం చర్యలు చేపట్టాలి



వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కొల్లిపర: అధిక వర్షాలకు మండలంలో పల్లపు ప్రాంతంలో వరి పంట ముంపునకు గురైంది. ఎండాకు తెగులు, ఆకుముడత తెగులు వ్యాపించే అవకాశాలు ఎక్కువశాతం ఉంది. వర్షాలు తగ్గటం వలన రెండు రోజుల నుంచి చాలా గ్రామాలలో వరిలో పూర్తి స్థాయిలో నీరు బయటకు పంపుతున్నారు. ముంపునకు గురైన వరి పంటలో సస్య రక్షణ తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు రైతులకు సూచిస్తున్నారు.

- నారుమడిలో విత్తనం చల్లిన 2–3 రోజుల వయసులో మూడురోజులకు మించి నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. వీలైనంత త్వరగా నీరు బయటకు తీసి వేయాలి.
- వరదలు సమయంలో వరి పిలక దశలో 5 రోజుల వరకు నీట మునిగినా బతికే అవకాశం ఉంది. నీరు బయటకు పోయిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా మరియు 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలి.
- వరికి ఎండు ఆకు తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో ఉన్న నీరు పూర్తిగా బయటకు తీసి మరల నీరు పెట్టాలి. ఇలా 3 సార్లు చేయాలి. అనంతరం పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఒక సారి, మరల చిరుపొట్ట దశలోను వేయాలి. తెగులు సోకిన పొలానికి నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి.
- వరి పంటపై పాము పొడ తెగులు ఆశిస్తే నివారణకు లీటరు నీటికి 2.0 మి.లీ హెక్సాకొనజోల్ 5% ఈసీ లేదా 2.0మి.లీ వాలిడామైసిన్ 3ఎల్ లేదా 1.0 మి.లీ ప్రోపికొనజోల్ 25% ఈసీ లేదా 0.4 గ్రా ట్రిఫ్లాక్సీస్ట్రోబిన్ 25% మరియు టెబుకొనజోల్ 50% డబ్ల్యూజీ లేదా 1.5 మి.లీ అజాక్సీస్ట్రోబిన్ 11% మరియు టెబుకొనజోల్ 18.3% డబ్ల్యూజీ లేదా 1.0 మి.లీ అజాక్సీస్ట్రోబిన్ 25% మందులలో ఏదో ఒక దాన్ని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు మార్చి పిచికారి చేయాలి.
- ఆకుముడత నివారణకు లీటరు నీటికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు, లేదా క్లోరాన్ట్రినిప్రోల్ 0.3 మి.లీ. నీటిలో కలపి పిచికారీ చేసుకోవాలి. చిరు పొట్టదశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు వేసుకోవాలి. దోమ ఎక్కుగా ఆశించే ప్రాంతాల్లో ఈ పురుగుల నివారణకు ప్రొఫెనోఫాస్, ట్రైజోఫాస్, క్లోరిపైరిఫాస్, మోనోక్రోటోఫాస్, సింథటిక్ పైరిత్రాయిడ్ వంటి మందులు పిచికారీ చేయకూడదు.

నీరు నిలిచిన ఖాళీస్థలాల్లో ఆయిల్ బాల్స్



తెనాలి: పట్టణంలో దోమల నివారణలో భాగంగా బుధవారం స్థానిక నాలుగో పారిశుద్ధ్య డివిజన్ పరిధిలోని 12వ వార్డు డొంకరోడ్డులో నీరు నిల్వ ఉన్న ఖాళీస్థలాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్య శాఖాధికారిణి హెలెన్ నిర్మల పర్యవేక్షించారు. ఖాళీస్థలాలు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కమిషనర్ బండి శేషన్న స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, శానిటరీ కార్యదర్శులు సంధ్య, శాంతి, హవీల, ప్రవీణ్, సాగర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్యంతో ఆరోగ్యంపై దుష్ప్రభావం



ర్యాలీలో డాక్టర్ సుబ్బారావు, సిబ్బంది

తెనాలిరూరల్: వాతావరణ కాలుష్యం ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోందని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు అన్నారు. వాతావరణ కాలుష్యం, దుష్ప్రభావాలపై కొలకలూరులో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. వాయు కాలుష్యంతో ఊపిరితిత్తులకు సంబంధించి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఊపిరితిత్తులు, గుండె సమస్యలున్న వారు జాగ్రత్తగా ఉండాలని, వాలుకాలుష్యం ఉన్న ప్రదేశాలకు వెళ్లకపోవడం మేలన్నారు. సిగరెట్లు తాగడం, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రదేశాలకు వెళ్లడం, బాణసంచా కాల్చడం వంటి పనులు చేయకూడదని సూచించారు. లక్ష్మీప్రసన్న, ఎం.వెంకటరెడ్డి, ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లు ర్యాలీలో పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో అన్నదానం



తెనాలి: పట్టణ 11వ వార్డులోని గురవయ్య కాలనీలో శ్రీవిఘ్నేశ్వర భక్తబృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నప్రసాద వితరణ చేశారు. ఆ వార్డు కౌన్సిలర్ కఠారి రత్నకుమారి ముఖ్యఅతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్డు ప్రముఖులు కఠారి హరీష్, హరిదాసు గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, పెయింటర్ శ్రీను, కమిటీ సభ్యులు పొట్లూరి అశోక్, కదుకూరి శ్రీనివాసరావు, పొట్లూరి సాయి, మహంకాళి, ఆంజనేయులు, తిరుపతయ్య, సుబ్బారావు, మిత్రబృందం పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారాలు

తెనాలి: పట్టణ స్వరాజ్ టాకీస్ సెంటర్లోని సాయిబాబు గుడి వద్ద మూడు దశాబ్దాలుగా భిక్షాటనతో జీవనం సాగిస్తున్న వృద్ధుడు మంగళవారం రాత్రి పొద్దుపోయాక మృతిచెందాడు. అతడు అనాథ కావటంతో సాయిబాబా గుడి కమిటీ విజ్ఞప్తి మేరకు పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం అంత్యక్రియలు చేశారు. సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు కలిసి, యాచకుడి మృతదేహాన్ని బుర్రిపాలెంరోడ్డులోని మహాప్రస్థానానికి తరలించారు. సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవా సమితి అనాథ శవాలకు చేస్తున్న అంతిమ సంస్కార సేవలను మహాప్రస్థానం సేవాసమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ అభినందించారు. గుంటూరుకు చెందిన స్వామి జ్ఞానప్రసన్న ఆశీస్సులతో ఆరేళ్లుగా ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయటం, అనాథలు, నిస్సహాయులుగా మరణించినవారికి అంత్యక్రియలను చేస్తున్నట్టు కుర్రా శ్రీను తెలిపారు. వీరి అస్తికలను తీసుకుని కాశీలోని గంగానదిలో నిమజ్జనం, పిండప్రదానం చేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పాలడుగు బ్రహ్మం పాల్గొన్నారు.